క్లుప్తంగా

రసాయన ఎరువులు అధికంగా వాడొద్దు



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ అన్వేష్‌కుమార్

శింగనమల: రైతులు రసాయన ఎరువులను అధిక మోతాదులో వాడొద్దని, వాటికి బదులుగా భౌతిక ఎరువులు వాడాలని ఏఓ అన్వేష్ కుమార్ సూచించారు. బుధవారం సోదనపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ రసాయన ఎరువులు తక్కువగా వాడి ఆహార ఉత్పత్తులను పండించాలన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను గుత్తి ఎఫ్‌పీఓ వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. ఏఈఓ అక్కమ్మ, వీహెచ్‌ఏ రాజారెడ్డి, గౌతమిపురి రైతు ఉత్పత్తిదారుల సంఘం గుత్తి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సివిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ సివిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫీ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 31 లోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రైల్వేక్వార్టర్స్‌కు అడ్డంగా నిర్మించిన గోడలు తొలగించాలి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: రైల్వేక్వార్టర్స్‌లో నుంచి ఇతర ఏరియాలకు వెళ్లే రహదారులకు అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భవానిని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం ఆమెకు సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రమేష్, మారుతి, షబ్బీర్, రాము తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రహరీతో ప్రజలెదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆమెను కోరారు.ఈ విషయమై కౌన్సిల్‌లో చర్చించి ప్రజలకు మేలు చేకూర్చాలని వారు విన్నవించారు.

పందుల అపహరణ

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో పందులు అపహరణకు గురయ్యాయి. వివరాలు.. కాలనీలో నివాసముండే నారాయణస్వామి తన పందులను దొడ్డిలో ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున దొడ్డిలోకి ప్రవేశించి 15 పందులను ఎత్తుకెళ్లారు. ఘటనలో దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి



డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుత్తి: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీ సాయి జూనియర్ కాలేజీలో బుధవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్, పట్టణ కార్యదర్శి కిరణ్ మాట్లాడారు. సుమారు మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం , అధికారులు స్పందించి డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ సీనియర్ నాయకులు వినోద్, లక్ష్మి ప్రసాద్, ధనుష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



జైబూన్

గుత్తి రూరల్: యంగన్నపల్లికి చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ నబీ రసూల్ తెలిపిన మేరకు వివరాలు..గ్రామానికి చెందిన షేక్.ఖాసీం భార్య షేక్ జైబూన్(44) ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలసిన చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం జైబూన్ తల్లి హుస్సేన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేశామని, మహిళ ఆచూకీ తెలిసిన వారు 9346010582, 9346917082 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.



కఠిన చట్టాలు రూపొందించాలి

వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించాలి. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన సమాజంలో అందరినీ కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. నేరం చేసిన వారికి త్వరగా శిక్షలు పడేలా ప్రభుత్వాలు చొరవచూపాలి.

–డాక్టర్ స్వాతి లక్ష్మి బీకేఎస్ పీహెచ్‌సీ



వైద్యులపై దాడులను అరికట్టాలి

దేశవ్యాప్తంగా రోజూ ఏదో ఒక ప్రాంతంలో వైద్యులు, వైద్యసిబ్బందిపై దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు ఇలాంటి వాటిని అరికట్టాలి. ప్రధానంగా మహిళ వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు రూపొందించాలి. ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే వైద్యం ఎలా అందిస్తారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘటన అందరినీ కలచివేసింది.

–డాక్టర్ కమలాకర్, సీహెచ్‌సీ, పామిడి



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస

- స్టాండింగ్ కౌన్సిల్ ఎంపికపై రగడ
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- సభ్యుల కోరిక మేరకు అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన చైర్‌పర్సన్



వాగ్వాదానికి దిగిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం రసాభాసగా ముగిసింది. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్(మున్సిపాల్టీ తరపున వాదించే న్యాయవాది)ని నియమించుకునే అంశంపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో పలువురు సభ్యుల కోరిక మేరకు స్టాండింగ్ కౌన్సిల్ ఎంపిక అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. తొలుత అజెండాలో పొందుపరిచిన అంశాలన్నీ ఆమోదిస్తున్నామని, అయితే మున్సిపల్ న్యాయవాది నియామకపు అంశంపై చర్చ కొనసాగించాలని టీడీపీ సభ్యుడు కృపాకర్ కోరారు. మున్సిపల్ న్యాయవాది పదవి కోసం దరఖాస్తు చేసుకున్న ఏడుగురు న్యాయవాదుల్లో టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అయిన బీఎస్.క్రిష్ణారెడ్డి పేరును ప్రతిపాదించడంతో పాటు ఆమోదిస్తున్నామని కృపాకర్ చెప్పాడు. దీనిపై కోఆప్షన్ సభ్యుడు రాజశేఖర్ అభ్యంతరం చెప్పడంతోపాటు తాము కూడా గోపాలక్రిష్ణ అనే న్యాయవాదిని ప్రతిపాదిస్తున్నామని చెప్పాడు. ఈ అంశంపై కోఆప్షన్ సభ్యులకు మాట్లాడే హక్కు లేదని, మీకు ఓటు హక్కే లేనప్పుడు ఎలా మాట్లాడతారని టీడీపీ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులపై విరుచుకుపడ్డారు. కౌన్సిల్ సమావేశాల్లో సలహాలు, సూచనలిచ్చే బాధ్యత తమకుందని, మున్సిపల్ చట్టం గురించి తెలుసుకుని మాట్లాడాలని కోఆప్షన్‌సభ్యులు రాజశేఖర్, ఫ్లయింగ్ మాబు, ముంతాజ్‌బేగం టీడీపీ కౌన్సిలర్లపై మండిపడ్డారు. గోపాలక్రిష్ణ అనే వ్యక్తిని తాను ప్రతిపాదిస్తున్నానని వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్ చాంద్‌బాషా పేర్కొన్నాడు. కమిషనర్ వెంకటరమణయ్యతో చర్చించిన చైర్‌పర్సన్ ఓటింగ్ జరిపేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే టీడీపీ కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ తమ కౌన్సిలర్ నాగరత్న కాలికి దెబ్బ తగిలిన కారణంగా కౌన్సిల్ హాల్‌లోకి రాలేదని, వీడియో కాల్ ద్వారా ఆమె ఓటును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు కూడా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఓటు పరిగణలోకి తీసుకోవాలని పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. కౌన్సిల్ సమావేశానికి హాజరుని సభ్యుల ఓటింగ్ పరిగణలోకి తీసుకోవడం కుదరదని చైర్‌పర్సన్ తేల్చిచెప్పారు. దీంతో టీడీపీ సభ్యులు కమిషనర్‌తో వాదనకు దిగారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరిన సభ్యుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించడంతో సమావేశం ముగిసింది. దీంతో అక్కడికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే సోదరుడు నారాయణస్వామి, టీడీపీ కౌన్సిలర్లు కృపాకర్, పవన్‌గౌడ్ తదితరులు కమిషనర్‌తో వాదనకు దిగారు. మెజార్టీ సభ్యులు కలిగిన టీడీపీ కౌన్సిలర్లు సూచించిన మేరకు క్రిష్ణారెడ్డిని మున్సిపల్ న్యాయవాదిగా ఎంపిక చేస్తూ ఆమోదించాలని పట్టుబట్టారు. చట్టప్రకారం అలా కుదరదని, అంశాన్ని వాయిదా వేస్తున్నామని చైర్‌పర్సన్ ప్రకటించి కౌన్సిల్ హాల్ నుంచి బయటికి వెళ్లిపోయాక ఆమోదించలేమని, అవసరమైతే ఇంకో రోజు సమావేశం పెట్టుకుని మెజార్టీ సభ్యుల ఏకాభిప్రాయం మేరకు ఎంపిక చేసుకోవచ్చని కమిషనర్ చెప్పారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ ఎంపిక అంశాన్ని ప్రతిష్టగా తీసుకున్న టీడీపీ ఎన్నిక జరగకుండా వాయిదా పడటంతో నిరాశ చెందారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మైమూన్, నైరుతిరెడ్డి పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ ఎంపికకు..రాజకీయ రంగు

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ నియామకం రాజకీయ పార్టీలకు సంబంధం లేని విషయం. ప్రతి మూడేళ్లకోసారి మున్సిపాల్టీ తరపున కోర్టు కేసులను వాదించడానికి ఓ న్యాయవాదిని నియమించుకునేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి కౌన్సిల్ ఆమోదం మేరకు అర్హతలు కలిగిన వ్యక్తిని ఎంపిక చేసుకునేవారు. గతంలో ఎప్పుడూ మున్సిపల్ న్యాయవాది ఎంపికపై రగడ జరగలేదు. కానీ ఈ సారి మున్సిపల్ న్యాయవాది పోస్టుకు ఏడుగురు లాయర్లు దరఖాస్తు చేసుకున్నారు. అందులో నలుగురు లాయర్లు టీడీపీకి అనుకూలమైన వ్యక్తులే. దీన్ని బట్టి తమ పార్టీలో సఖ్యత లేని కారణంగానే ఇలా జరిగిందని తెలుగు తమ్ముళ్లు బహిరంగంగా చర్చించుకున్నారు. తాము ఫలానా న్యాయవాదికి సిఫార్సు చేస్తున్నాం..ఇంకెవ్వరూ దరఖాస్తు చేసుకోవద్దని సొంత పార్టీకి అనుకూలమైన వారికే సర్ది చెప్పుకోలేకపోతే ఎలా అని వారు బహిరంగంగా చర్చించుకున్నారు.

ఏడో రోజూ ‘సత్యసాయి’ కార్మికుల సమ్మె





బీకేఎస్‌లో సమ్మె చేస్తున్న కార్మికులు, కల్లూరులో నిరసన తెలియజేస్తున్న కార్మికులు

బుక్కరాయసముద్రం: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు స్థానిక సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద బుధవారం ఏడో రోజూ సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు రాఘవేంద్రాచారి మాట్లాడుతూ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులకు జీతాలు మంజూరు చేయాలని ఎన్నిసార్లు విన్నవిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదన్నారు. 6 నెలలుగా జీతాలు మంజూరు చేయలేదన్నారు. 600 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా ప్రభుత్వం ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్మిక సంఘం నాయకులు దేవదాస్, కిష్టప్ప, లక్ష్మిన్న, పెద్దన్న, నల్లప్ప, నారాయణ, విశ్వరూప, విశ్వనాథ్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బుధవారం కల్లూరులో బాబా ఆదుకోవా అంటూ సత్యసాయి చిత్రపటం ముందు చేతులు చాచి ప్రార్థించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడు తున్నామన్నారు. గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా అధికారులు, ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. కార్మికులు నాగభూషణ, మల్లరాయుడు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, సాంబశివ, ఈశ్వరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న ఏడీఏ రవి

బుక్కరాయసముద్రం: మండలంలో ఖరీఫ్ కింద రైతులు సాగు చేసిన పంటలకు సంబంధిం పంట కోత ప్రయోగాలు నిర్వహించాలని ఏడీఏ రవి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రణాళికా విభాగం పంపిన ర్యాండం అంకెల ఆధారంగా సర్వే నంబర్లను గుర్తించి ఆ పొలాల్లో ప్రయోగాలు చేపట్టాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రయోగాలు నిర్వహించాలని సూచించారు. కౌలు రైతులను గుర్తించి వారికి పంట రుణాలు అందేలా చూడాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి ఉలవలు, జొన్నలు, పెసలు తదితర విత్తనాలు పంపిణీ చేసేందుకు రైతే సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టాలని సూచించారు. ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి, మండల గణాంక అధికారి పోతిరెడ్డి, ఏఈఓలు పవన్, జ్ఞానజ్యోతి, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ తాడిపత్రి పరిధిలోని ఐదు మండలాల కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ను వెంటనే పరిష్కరించి సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం కన్వీనర్ ఉమాగౌడ్, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, రమణ, రవికుమార్, కృష్ణనాయక్, గోవింద్ నాయక్, వెంకటేష్ నాయక్, శ్రీరాములు, రాజు, అబ్రహం పాల్గొన్నారు.

కమిషనర్‌కు వీడ్కోలు



కమిషనర్‌ను సన్మానించిన దృశ్యం

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బదిలీపై వెళ్తున్న కమిషనర్ రామ్మోహన్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆయన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది కమిషనర్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఇదిలా ఉండగా విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన నూతన కమిషనర్ శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది నూతన కమిషనర్‌కు స్వాగతం పలికారు.

వృద్ధాశ్రమానికి టీవీ అందజేత

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమానికి ఓ వృద్ధుడు బుధవారం టీవీ వితరణ చేసినట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు ప్రసాద్ తెలిపారు. అగాపే వృద్ధాశ్రమంలో ఉంటున్న అశోక్ అనే వృద్ధుడు తనతో పాటు ఆశ్రమంలోని వృద్ధులకు వినోదం కలిగించాలనే ఉద్దేశంతో తన సొంత డబ్బుతో టీవీ అందజేశాడు.

దత్తాత్రేయ ఆలయంలో పూజలు

పామిడి: స్థానిక వడ్డేవీధిలోని మహాయోగ దత్తపీఠంలో బుధవారం దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ ఆలయ పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. భక్తులు పీఠాధిపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా కవి నారాయణమూర్తిని పీఠాధిపతి శాలువాతో ఘనంగా సత్కరించారు.

తల్లీకుమారుడి అదృశ్యం

గార్లదిన్నె: జంబులదిన్నెకు చెందిన ఓ మహిళ తన కుమారుడుతో కలసి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుమిత్ర(30) అనే మహిళ ఈనెల 26న తన పుట్టిల్లు కల్లూరుకు వెళ్తానని భర్త రంగారెడ్డికి చెప్పి తన చిన్న కుమారుడితో కలసి వెళ్లింది. అయితే ఆమె పుట్టింటికి వెళ్లలేదు. బుధవారం రంగారెడ్డి తన మామకు ఫోన్ చేయగా ఆమె పుట్టింటికి వెళ్లని విషయం వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

డీఆర్‌ఎంను కలిసిన రైల్వే ఎస్పీ



డీఆర్‌ఎంతో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ విజయ్‌కుమార్‌ను జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా మర్యాదపూర్వకంగా కలిశారు. జీఆర్‌పీ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా బుధవారం డీఆర్‌ఎంను ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారు చర్చించారు. ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను డీఆర్‌ఎం ఎస్పీకి తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్

యాడికి: మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. తాడిపత్రి మండలం యుగుడూరుకు చెందిన మొలక నాగేష్ పెద్దపప్పూరు మండలం జూటూరు వద్ద గల పెన్నానది నుంచి తన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సీజ్ చేశామన్నారు.

గార్లదిన్నె: గుడ్డాలపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు. పామిడికి చెందిన రాము అనే వ్యక్తి పెన్నానది నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

‘వినాయక’ విక్రయాలు షురూ

- గతంలో కంటే 20 శాతం ధరలు అధికం
- యువకులను ఆకర్షిస్తున్న గణపతులు





విక్రయానికి సిద్ధంగా ఉన్న గణపతులు, కడప రోడ్డులోని రామస్వామి ఆలయంలో ఉన్న విగ్రహాలు

తాడిపత్రి రూరల్: వినాయక చవితి ఉత్సవాలకు గణపతులు సిద్ధమయ్యారు. వ్యాపారులు వివిధ ప్రాంతాల్లో తయారు చేసిన విగ్రహాలను తాడిపత్రికి తీసుకొస్తున్నారు. వీటిని ఆలయాలు, కొత్తగా నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లలో భద్రపరుస్తున్నారు. వివిధ రూపాల్లో రూపొందిన గణపయ్య విగ్రహాలు యువకులను ఆకట్టుకుంటున్నాయి. మూడు అడుగుల నుంచి 12 అడుగల ఎత్తు వరకు విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

విగ్రహం ఎత్తున బట్టి ధర..

వినాయక విగ్రహాల ఎత్తున బట్టి ధర ఉంటోంది. 9 అడుగుల విగ్రహం రూ.12 నుంచి రూ.15 వేల ధర పలుకుతోంది. విగ్రహాల ధరలు గతేడాది కన్నా 20 శాతం అధికంగా పెరిగినట్లు తెలుస్తోంది. గతంలో కేవలం తాడిపత్రి పట్టణంలో మాత్రమే మండపాల్లో వినాయక ప్రతిమలను కుర్చోబెట్టి ఐదు రోజుల తరువాత నిమజ్జనం చేసేవారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా విగ్రహాలను కుర్చోబెట్టి మూడు రోజుల తరువాత నిమజ్జనం చేస్తున్నారు. ఈక్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువకులు పోటీపడి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్, గుంతకల్లులో తయారైన విగ్రహాలను వ్యాపారులు ఇక్కడికి తీసుకొస్తున్నారు. కొందరు నచ్చిన విగ్రహాలకు డ్వాన్సులు చెల్లించి బుక్ చేసుకుంటున్నారు. మొత్తం మీద కొనుగోలుదారులతో వినాయక విగ్రహాల విక్రయ కేంద్రాలు సందడిగా మారాయి.

కూలి గిట్టుబాటు అవుతోంది



గణపతుల విగ్రహాలను విక్రయించడం వల్ల కూలి గిట్టుబాటు అవుతోంది. కొన్నేళ్లుగా విగ్రహాలను గుంతకల్లు తయారి కేంద్రాల నుంచి తెచ్చి విక్రయిస్తున్నా. మొత్తం నగదు చెల్లించి విగ్రహాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. అక్కడి నుంచి రవాణా ఖర్చులు అదనం. కొనుగోలు చేసిన విగ్రహాలు అమ్మడబోతే లాభాలు ఉంటాయి.

– మస్తాన్, విగ్రహాల వ్యాపారి

వన్‌టౌన్ సీఐగా మనోహర్



గుంతకల్లుటౌన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బి.మనోహర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ రామసుబ్బయ్య వీఆర్‌కు బదిలీ అయ్యారు. మడకశిరలో పనిచేస్తున్న మనోహర్‌ను ఇక్కడికి నియమించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన సీఐ మనోహర్ పేర్కొన్నారు.

బీకేఎస్ సీఐగా శ్రీధర్



బుక్కరాయసముద్రం: స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐగా శ్రీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వెంకటేశ్వర్లు ఎస్పీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో శింగనమలలో సీఐగా పని చేస్తున్న శ్రీధర్‌ను నియమించారు. ఈసందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

తాడిపత్రి అర్బన్ సీఐగా సాయిప్రసాద్



తాడిపత్రి అర్బన్: పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పి.సాయిప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న నాగేంద్రప్రసాద్ ధర్మవరానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో సీఐగా పనిచేస్తున్న సాయిప్రసాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈసందర్భంగా సిబ్బంది నూతన సీఐకి స్వాగతం పలికారు. అనంతరం సీఐ డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ



విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీలో బుధవారం సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నిర్మల, రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అమర వీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మట్లాడుతూ ఆగస్టు 28, 2000 సంవత్సరంలో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఆందోళన చేపట్టిన రైతులపై పోలీసులు కాల్పులు జరిపి నలుగురిని చంపేశారన్నారు. వారి త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తరిమెలలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

శింగనమల: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వాధ్యులు పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్. శంకర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. బుధవారం తరిమెల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేయించారు. మురుగుకాలువల్లో పూడిక తీయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్ వైజర్ గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలతు అశ్వర్థనారాయణ, నాగమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుని కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం సతీష్ స్వామి, రామకృష్ణాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కొనసాగాయి. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీకృష్ణుడికి సత్యభామ, రుక్మిణిలతో కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. తదనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

గుత్తి: ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం జొన్నలు, ఉలవలు తదితర విత్తనాలను 80 శాతం రాయితీతో పంపిణీ చేస్తామని ఏఓ మెహరున్నీషా బేగం తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యామ్నాయ విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.